క్లుప్తంగా

ఘనంగా భీమన్న దేవుడి పండుగ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని భీమన్న గుట్ట వద్ద సోమవారం భీమన్న దేవుడి పండుగను ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల కిందట భీమన్న దేవుడి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భీమన్న గుట్ట వద్ద నాయికపోడ్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి పల్లకి ఊరేగింపు



పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

తాంసి: మండలంలోని బరంపూర్ గ్రామంలో కొండపై వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి పల్లకి ఊరేగింపు సోమవారం తాంసికి చేరుకుంది. గ్రామస్తులు డప్పుచప్పులతో వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో చేపట్టిన ఊరేగింపులో మహిళలు మంగళ హారతులతో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పోచ్చన్న, నాగారెడ్డి, రాజు, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జాతర నిర్వహించారు. భక్తులు సమర్పించిన కానుకలు, నగదు గ్రామస్తుల సమక్షంలో లెక్కించారు. రూ.78వేల నగదుతో పాటు 7 గ్రాముల బంగారం, వెండి 750 గ్రాములు భక్తులు సమర్పించినట్టు సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ బాగిడి కిష్టయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు లక్ష్మణ్, కోకటి రాజు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై దృష్టి సారించాలి

నార్నూర్: గ్రామాల్లో శానిటేషన్, క్లోరినేషన్‌తో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సమన్వయకర్త రాథోడ్ సందీప్ అన్నారు. సోమవారం మండలంలోని గంగాపూర్, గుంజాల గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణాలను వందశాతం చేపట్టాలన్నారు. మరుగుదొడ్లు మంజూరు కానీ వారికి కొత్తగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, రమేశ్, గ్రామస్తులు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

తలమడుగు: విద్యార్థులకు న్యాణమైన విద్యనందించాలని డీఈవో ప్రణీత అన్నారు. సోమవారం మండలంలోని ఖోడద్, తలమడుగు జెడ్పీ పాఠశాలలను తనిఖీ చేశారు. ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? ఎంత మంది హాజరయ్యారు అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. పూర్తిస్థాయిలో విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. ఆమె వెంట హెచ్‌ఎం శ్యాంసుందర్, కృష్ణకుమారి, వినోద్‌రెడ్డి, లక్ష్మీ, మమత, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

బోథ్: బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాల జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు 8 సంవత్సరాల నుంచి ప్రభుత్వం ఎటువంటి సంక్షేమ పథకాలు చేపట్టడం లేదన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో 50శాతం ఫీజు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, నాసర్ అహ్మద్, అబ్రహం, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నార్నూర్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని ఎస్‌ఎస్‌సీ జిల్లా మానిటరింగ్ టీం సభ్యుడు చౌహాన్‌భారత్, తిరుపతినాయక్‌లు అన్నారు. సోమవారం మండలంలోని భీంపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ప్రత్యేక తరగతుల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. 100శాతం ఫలితాలు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

- గ్రామాల్లో విజృంభిస్తున్న దోమలు
- పనిచేయని ఫాగింగ్ యంత్రాలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



డ్రెయినేజీలో పేరుకుపోయిన పూడిక



పొన్నారిలో మరమ్మతులకు నోచుకోని ఫాగింగ్ యంత్రాలు

తాంసి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో రోజురోజుకూ గ్రామాల్లో దోమల బెడద తీవ్రమౌతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం కాగానే ఇళ్లలోకి చేరుతుండటంతో ప్రజలు ఉండలేని పరిస్థితి నెలకొంటుంది. తాంసి మండలంలోని కప్పర్ల, పొన్నారి, హస్నాపూర్, వడ్డాడి, సావర్గాం, గోట్కూరి, పాలోది, గిరిగాం గ్రామాల్లో దోమల వ్యాప్తితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని శుక్రవారం రోజు నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు కొడాల భాగ్యలక్ష్మీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

అధ్వానంగా డ్రెయినేజీలు..

పలు గ్రామాలలో డ్రెయినేజీల నిర్వహణ సరిగా లేదు. చాలా వరకు మురికి కాలువలు పూడికపోయాయి. ఎక్కడి నీరు అక్కడ నిలుస్తుండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. గతంలో దోమలు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు డ్రెయినేజీలు శుభ్రం చేసేవారు. వారానికి ఒక్కసారి బయో లార్వా సైతం పిచికారీ చేసేవారు. ప్రస్తుతం డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

పత్తాలేని ఫాగింగ్ యంత్రాలు..

దోమల వ్యాప్తి అరికట్టేందుకు గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశారు. దోమల వ్యాప్తి తీవ్రతను బట్టి ఆయా గ్రామాల్లో ప్రతీ నెల రోజులకు ఒకసారి ఫాగింగ్ చేసేవారు. గతంలో పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు ప్రస్తుతం మరమ్మతులకు గురకావడంతో కొన్ని నెలలుగా ఫాగింగ్ చేయడం లేదు. డ్రెయినేజీల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విషజ్వరాలు సైతం ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపడుతాం

దోమల నివారణకు గ్రామాల్లో చర్యలు చేపడుతాం. ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టి పారిశుధ్య పనులు చేపడుతాం. ప్రతీ గ్రామంలో ఫాగింగ్ మిషన్లను బాగుచేసి ఫాగింగ్ చేస్తాం. ఫాగింగ్ మిషన్లకు వెంటనే మరమ్మతులు చేయిస్తాం.
– సుధీర్ రెడ్డి, ఎంపీవో

అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా వసతిగృహం



నేరడిగొండ: మండలంలోని వాంకిడిలో అటవీశాఖ అధికారుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహం నిరుపయోగంగా మారింది. అడవులను సంరక్షించాలనే ఉద్దేశంతో వసతి గృహం నిర్మించారు. కానీ అధికారులు ఉండడం లేదు.
– అధికారి పేరు: గణేష్, ఎఫ్‌ఆర్‌వో, నేరడిగొండ, ఫోన్: 70131 33705

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం



రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీవో సౌందర్య

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని సీడీపీవో సౌందర్య అన్నారు. సోమవారం మండలంలోని తేజాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం పంపిణీ చేస్తుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమె వెంట అంగన్‌వాడీ టీచర్, ఆయా ఉన్నారు.

సమయపాలన పాటించాలి

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. సోమవారం మండలంలోని బుద్దికొండ, వడూర్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రీస్కూల్ పిల్లల హాజరు శాతం పెంచాలని సూచించారు. గృహ సందర్శన ద్వారా ఇంటింటికి తిరుగుతూ గర్భిణులకు, బాలింతలకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



మనఊరు.. మనబడి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని చిల్కూరి లక్ష్మినగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు.. మనబడి కింద అభివృద్ధి చేసిన పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. నూతన డెస్క్ బెంచీలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. నాణ్యత ప్రమాణాలు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణిత, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు సంద నర్సింగ్, అశోక్ స్వామి, నాయకులు గోలి తిరుపతి, కస్తాల ప్రేమల, బొడగం మమత, దాసరి రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే చేరికలు

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసే పలువురు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని చిల్కూరి లక్ష్మినగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ చేరికల కార్యక్రమానికి హాజరయ్యారు. ఎమ్మెల్యేకు స్థానిక నేతలు ఘనంగా స్వాగతం పలికి, పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా సమర్థవంతమైన పాలన అందిస్తున్నామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దటి లేకుండా భగీరథ నీరు అందిస్తామన్నారు.

క్రీడలతో స్నేహభావం



ట్రోఫీ అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని వైస్ ఎంపీపీ కుమ్ర జంగు అన్నారు. సోమవారం మండలంలోని అంకాపూర్ (బండగూడ)లో వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ.. క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో లింగుగూడ సర్పంచ్ సిడాం లక్ష్మణ్, అంకాపూర్ ఉప సర్పంచ్ కొడప భీంరావు, మాజీ సర్పంచ్ మర్సుకోల కేశవ్‌రావు, సిడాం గణపతి, మర్సుకోల పవన్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

గుడిహత్నూర్: మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. మండల కేంద్రానికి చెందిన జయం టీం విజయం సాధించి ప్రథమ బహుమతి రూ.51 వేలు గెలుపొందింది. రెండో బహుమతిగా మేనేజ్‌మెంట్ టీం రూ.21వేలు సాధించుకుంది. మ్యాచ్‌ను ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ తనయుడు అడ్వకేట్ విశ్వజిత్, నాయకులు సూర్యప్రకాష్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరాడ్ బ్రహ్మానంద్ వీక్షించి బహుమతులు అందజేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సోనేరావును అభినందిస్తున్న ఎంపీ సోయం బాపురావు

- ఎంపీ సోయం బాపురావు

ఆదిలాబాద్‌రూరల్: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు అన్నారు. గిరిజన మోర్చా ఎస్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆదిలాబాద్‌రూరల్ మండలానికి చెందిన కొడప సోనేరావు నియమితులు కాగా.. సోమవారం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో శాలువతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సోనేరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టడం పట్ల ఎంపీ, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

బోథ్: రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఎంపీ సోయం బాపురావు అన్నారు. బీజేపీ కార్నర్ మీటింగ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ పథకాల పేరుతో ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుభాష్ సూర్య, గొర్ల రాజు యాదవ్, జి.వి.రమణ, నల్ల గంగయ్య, బోరె రవీందర్ పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు ఆకుల రాజేందర్ ఇటీవల కాలుకు ఆపరేషన్ కావడంతో ఎంపీ సోయం బాపురావు సోమవారం ఆయనను పరామర్శించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీ వెంట నాయకులు గొర్ల రాజు యాదవ్, తదితరులు ఉన్నారు.

'హామీల అమలులో కేసీఆర్ విఫలం'

జైనథ్: హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫమైయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. సోమవారం మండలంలోని గూడ గ్రామంలో ఏర్పాటు చేసిన శక్తి కార్నర్ సమావేశంలో మాట్లాడారు. సాధ్యం కానీ హామీలతో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ డబుల్‌బెడ్ రూంలు, రుణమాఫీ, నిరుద్యోగ భృతి హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి, మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, నాయకురాలు జ్యోతి, దయాకర్, సంతోష్, రమేష్, విజయ్, మయూర్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత



శ్రీదేవకినందన్ మహరాజ్ ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

బజార్‌హత్నూర్: ఆధునిక జీవితంలో ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని భగవత్ కథ వచన వక్త శ్రీదేవకినందన్ మహరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని మంజిరంతండాలో సప్తహ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శ్రీ దేవకినందన్ మహరాజ్ పాల్గొన్నారు. సప్తహ కార్యక్రమంలో భగవత్ ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య, ఎంపీపీ అజాడే జయశ్రీ, సర్పంచ్‌లు చందర్‌సింగ్, రాంరెడ్డి, అనిత కవిందర్, నిస్తే కైలాస్ పాల్గొన్నారు.

దేవకినందన్ మహరాజ్‌కు ఘన స్వాగతం

ఇచ్చోడ: భగవత్ కథ ప్రవచకుడు దేవకినందన్ మహరాజ్‌కు సోమవారం మండల కేంద్రంలో ఘన స్వాగతం పలికారు. బజార్‌హత్నూర్ మండలంలోని మంజిరాంతండాలో నిర్వహించనున్న భగవత కథలో ప్రవచించనున్న దేవకినందన్ మహరాజ్‌కు నిర్మల్ బైపాస్ నుంచి కొత్త బస్టాండ్ వరకు మహిళలు, గ్రామస్తులు నృత్యం చేస్తూ.. స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాంజిరాంతండా, భూతాయి, టెంబి గ్రామాలకు చెందిన 500 మంది పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ చారులత

ఇంద్రవెల్లి: నెరవేరని హామీలు ఇచ్చి సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని సమాక, పాటగూడ గ్రామాల్లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్‌తోనే బీఆర్‌ఎస్ పాలన అంతం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావ్, గాయక్‌వాడ్ దిలీప్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

నేడు హాథ్‌సే హాథ్ జోడో ప్రారంభం

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామం నుంచి మంగళవారం హథ్‌సే హాథ్ జోడో కార్యక్రమం ప్రారంభమవుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్, మండల కన్వీనర్ మహేందర్ తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్ రెడ్డిలు హాథ్‌సే హాథ్ జోడే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

25న హనుమాన్ దీక్షల స్వీకరణ

బేల: మండలంలోని సిర్సన్న సింగాపూర్ హనుమాన్ ఆలయంలో ఈనెల 25న 41రోజుల హనుమాన్ మండల దీక్ష స్వీకరణ ప్రారంభ అవుతుందని ఆలయ పూజారి దినేష్ చౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 17న 21రోజుల అర్ధ మండల దీక్ష, 27న 11 రోజుల దీక్ష స్వీకరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల భక్తులు దీక్షలు స్వీకరించాలని ఆయన కోరారు.

24న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ఇచ్చోడ: ఈనెల 24న మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో కల్యాణం నిర్వహించనున్నట్లు విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 24న ఉదయం 11 గంటలకు వీరబ్రహ్మేంద్ర గోవిందమాంబ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మరిన్ని సేవలు అందిస్తాం

తలమడుగు: బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ద్వారా ఖాతాదారులకు మరిన్ని సేవలు అందిస్తామని బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర దేశంలోని అన్ని బ్యాంకులలో సేవల్లో ముడో స్థానంలో నిలిచిందన్నారు. రైతులకు, మహిళా సంఘాలకు అన్ని విధాల సేవలు అందిస్తామన్నారు. అడిషనల్ మేనేజర్ పనేంద్ర, స్పెషల్ అసిస్టెంట్ కాడే స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణ బకాయిలను చెల్లించాలి

నేరడిగొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రుణాలు తీసుకున్న రైతులు బకాయిలను చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ సాబ్లే కిషోర్‌సింగ్ ఒక ప్రకటనలో కోరారు. ఏడీసీసీ బ్యాంకు మార్చి నుంచి సిబిల్‌లో నమోదు చేస్తున్నామన్నారు. సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే భవిష్యత్‌లో ఏ బ్యాంకు అప్పు మంజూరు చేయని పరిస్థితి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గమనించి ఈనెల చివరిలోగా బకాయిలను చెల్లించాలని కోరారు.

విద్యార్థులకు ఉపకార వేతనం

గుడిహత్నూర్: మండలంలోని ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మన్నూర్ జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు ఒకొక్కరికి రూ.వెయ్యి చొప్పున 25 మందికి ఉపకార వేతనం అందించారు. ఉల్లాస్ ట్రస్టు ప్రతినిధి సాంగ్లే చంద్రకాంత్ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులోని నైపుణ్యానికి ప్రోత్సహించేందుకు తమ సంస్థ ద్వారా ఏటా ఉపకారం వేతనం అందించడం జరుగుతుందన్నారు. ఎంఈవో నారాయణ, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మనంద్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

షీటీం సేవలపై అవగాహన

ఇంద్రవెల్లి: విద్యార్థినులు, మహిళలు షీటీం సేవలను సద్వినియోగం చేసుకోవాలని షీటీం హెడ్ కానిస్టేబుల్ వాణిశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు షీటీం సేవలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే వెంటనే 100కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం షీటీం టోల్ ఫ్రీ నెంబర్‌కు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు భాగ్యశ్రీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ర్యాలీ విజయవంతం చేయండి

తలమడుగు: నిజామాబాద్‌లో ఈనెల 26న నిర్వహించే మెగా శాఖాహారం ర్యాలీని విజయవంతం చేయాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ గంగారెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పూలజీబాబా ధ్యాన మందిరంలో సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అహింస జగత్ నిర్మాణం కోసం, ఆరోగ్య పరిరక్షణ కోసం నిజామాబాద్‌లో 10 వేల మందితో ర్యాలీ నిర్వహించడం జరుగుతందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, సురేష్‌రెడ్డి, సునీతరెడ్డి, అశోక్, రాకేష్‌నారాయణ పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ ఎదుట ఉద్రిక్తత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎదుట సోమవారం సాయంత్రం ఉద్రిక్తత నెలకొంది. ఒకే వర్గానికి చెందిన పలువురి మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఇరువురు ఒకరిపై ఒకరు దాడికి దిగారు. దీంతో పోలీసులు అప్రమత్తమై వారిని చెదరగొట్టారు. ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో వారి మధ్య గొడవ జరిగింది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ఇరువురు చేరుకున్నారు. మాటమాట పెరిగి ఉద్రిక్తతకు దారి తీసింది. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణను వివరణ కోరగా గొడవ జరిగింది వాస్తవమేనని, విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

కంటివెలుగు సద్వినియోగం చేసుకోవాలి



పరిశీలిస్తున్న ఎంపీపీ రాథోడ్ సజన్

నేరడిగొండ: అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. సోమవారం మండలంలోని లఖంపూర్‌లో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యులు పరీక్షించిన అనంతరం అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగు, వైద్యాధికారులు స్వప్న, రాంనరేష్, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ పాల్గొన్నారు.